సాక్షి శ్రీకాకుళం

బుధవారం । 13 । సెప్టెంబర్ । 2023



మర్యాదతోనే ఆదరణ

ఆర్టీసీ కండక్టర్లు, డ్రైవర్లకు శిక్షణ అందిస్తున్నారు. ప్రయాణికులతో మర్యాదపూర్వకంగా మెలిగేలా సూచనలిస్తున్నారు.

- 8లో



24న చెస్ పోటీలు

రాష్ట్రస్థాయి స్కూల్ ర్యాంకింగ్ చెస్ టోర్నమెంట్‌కు జిల్లా ఆతిథ్యం ఇవ్వనుంది. ఈ నెల 24న రణస్థలంలో పోటీలు ప్రారంభమవుతాయి.

- 8లో

16న జెడ్పీ సర్వసభ్య సమావేశం

అరసవల్లి: జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 16న ఉదయం 10.30 నుంచి జెడ్పీ సమావేశ మందిరంలో నిర్వహిస్తున్నట్లు జెడ్పీ సీఈవో ఆర్.వెంకట్‌రామన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలోని 38 మండలాలకు చెందిన అన్ని ప్రభుత్వ శాఖల ప్రగతి నివేదికలతో జిల్లా స్థాయి అధికారులంతా హాజరుకావాలని సూచించారు జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు తప్పనిసరిగా పాల్గొనాలని ఆయన కోరారు.

న్యూస్‌రీల్

ఎన్‌హెచ్‌ఎంలో కాంట్రాక్ట్ ఉద్యోగాలు

అరసవల్లి: జాతీయ హెల్త్ మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) జిల్లా పరిధిలో ఫార్మాసిస్టు గ్రేడ్–2, ఫిమేల్ నర్సింగ్ ఆర్డర్లీ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసినట్లు జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్ బి.మీనాక్షి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫార్మాసిస్టులు– 2 (ఓసీ మహిళ –1, ఎస్సీ మహిళ–1), ఫిమేల్ నర్సింగ్ –9 (ఓసీ–4, బీసీ–బీ–1, ఎస్సీ–2, ఈడబ్ల్యూఎస్–1, బీసీ–డీ–1) కేటగిరీ పోస్టు లకు ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 18న సాయంత్రం 5 గంటల్లోపు డీఎంహెచ్‌వో కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని సూచించారు. పూర్తి వివరాలకు శ్రీకాకుళం అధికారిక వెబ్‌సైట్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.

రాష్ట్రంలో ఆదర్శ పాలన



మాట్లాడుతున్న పంచాయతీరాజ్ అసిస్టెంట్ కమిషనర్ కృష్ణమోహన్

ఎచ్చెర్ల క్యాంపస్: గ్రామాల్లో స్వపరిపాలన లక్ష్యంగా ముందుకు సాగాలని జిల్లా పంచాయతీరాజ్ అసిస్టెంట్ కమిషనర్ ఈ.కృష్ణమోహన్ అన్నారు. ఎచ్చెర్లలోని జిల్లా సాంకేతిక శిక్షణ కేంద్రంలో మంగళవారం పంచాయతీ కార్యదర్శుల మూడో విడత శిక్షణ కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ సచివాలయ వ్యవస్థ అందుబాటులోకి వచ్చాక ప్రజలకు ప్రత్యక్ష సేవలు అందుతున్నాయని చెప్పారు. 12 మంది వరకు సిబ్బంది, 50 ఇళ్లకు వలంటీర్ సేవలు అందజేస్తున్నారని పేర్కొన్నారు. స్వపరిపాలన, స్థానిక సంస్థల బలోపేతం, పారదర్శక పాలన, అర్హులైన ప్రజలకు ప్రభుత్వ పథకాలు అందజేసేలా సచివాలయ వ్యవస్థ రూపొందినట్లు వివరించారు. దేశంలో ఆదర్శ పాలన సాగుతోందన్నారు. గ్రామాలు ప్రగతి సాధించాలంటే పారిశుద్ధ్య నిర్వహణ, సీసీ రోడ్లు, డ్రైనేజీలు, రోజు వారీ చెత్త సేకరణ, బహిరంగ మల విసర్జన నిర్మూలన, వీధి దీపాల నిర్వహణ కీలకమని చెప్పారు. కార్యక్రమంలో ఎస్టీవో ఎస్.సత్యకేశవరావు, రిసోర్సు పర్సన్లు పాల్గొన్నారు.

ఆదిత్యుని సన్నిధిలో మహా రుద్రాభిషేకం



అనివేటి మండపంలో మహా రుద్రాభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు

అరసవల్లి: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం అరసవల్లి సూర్యనారాయణ స్వామి సన్నిధిలో మంగళవారం ఏకాదశ పార్థివ మహాలింగ రుద్రాభిషేకం ఘనంగా పూర్తయ్యింది. ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో శ్రావణ మంగళవారాన శాస్త్రోక్తంగా ఈ అభిషేక ప్రక్రియ నిర్వహించగా భక్తులు హాజరై దేవదేవుని ఆశీస్సుల కోసం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనివేటి మండపంలోని 11 మండపాల్లో వేదమంత్రోచ్చారణల మధ్య కార్యక్రమం జరిపించారు. లోకకల్యాణార్థం ఈ అభిషేకం నిర్వహించినట్లు ప్రధానార్చకులు శంకరశర్మ తెలిపారు. కార్యక్రమంలో ఆలయ పాలకమండలి సభ్యులు మండవిల్లి రవి, ద్వారపు అనూరాధ, మైలపల్లి లక్ష్మి, జోగి మల్లెమ్మ, సీనియర్ అసిస్టెంట్ కృష్ణమాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

నిమ్మాడలో కేంద్ర బృందం తనిఖీలు




రేషన్ డిపో వద్ద అధికారులు

కోటబొమ్మాళి: కోటబొమ్మాళి మండలంలో కేంద్ర క్వాలిటీ తనిఖీ అధికారులు వీరేంద్ర, ప్రభాకర్‌లు మంగళవారం పర్యటించారు. నిమ్మాడలోని ఎఫ్‌సీఐ గోదాములను సందర్శించి బియ్యం బస్తాల నుంచి శాంపిల్స్ సేకరించారు. అనంతరం స్థానిక రేషన్ డిపోను తనిఖీ చేసి బియ్యం శాంపిల్స్ సేకరించారు. నాణ్యతను నిర్ధారించేందుకు నమూనాలు తీసుకెళ్తున్నట్లు కేంద్ర క్వాలిటీ తనిఖీ అధికారులు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా పౌర సరఫరాల అసిస్టెంట్ టెక్నికల్ మేనేజర్ హరిశంకర్, కోటబొమ్మాళి సీఎస్‌డీటీ కె.రాము, రేషన్ డీలర్ మెండ లలిత తదితరులు పాల్గొన్నారు.

భద్రతకు భరోసా దిశ







నిమిషాల వ్యవధిలో..

- 2023 మార్చి 4న వజ్రపుకొత్తూరు మండలం హుకుంపేటకు చెందిన 21 ఏళ్ల యువతిని మద్యం తాగిన వ్యక్తి ఈవ్‌టీజింగ్ చేస్తున్నాడంటూ యువతి బావ ఉదయం 10:26కు ఎస్‌ఓఎస్ బటన్ నొక్కి ఫిర్యాదు చేశారు.
  10:28 గంటలకు పీఎస్ నుంచి ఫోన్ వచ్చింది. కేవలం నిమిషాల్లో సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకున్నారు. స్టేషన్‌కు నిందితున్ని తీసుకెళ్లి ఎఫ్‌ఐఆర్ నమోదు చేశారు.
- 2023 మే 23న శ్రీకాకుళం నగరంలోని కాకివీధికి చెందిన 22 ఏళ్ల యువతిని ఓ వ్యక్తి వేధిస్తూ పొందూరు రాపాక జంక్షన్ వద్ద ఫాలో చేస్తున్నాడని సాయంత్రం 5:21కు దిశాయాప్ ద్వారా ఫిర్యాదు చేసింది. 5:25గంటలకు కు పొందూరు పీఎస్ ఏఎస్‌ఐకు సమాచారం అంది తనతో పాటు హెచ్‌సీ, పీసీలు స్పాట్‌కు వెళ్లి నిందితుడ్ని స్టేషన్‌కు తీసుకొచ్చారు. సాయంత్రం 6:00 గంటలకల్లా కేసు నమోదు చేశారు.
- 2023 ఏప్రిల్ 29న సంతబొమ్మాళి మండలంలో ఉంటున్న 25 ఏళ్ల వివాహిత తన కుమార్తెతో కలిసి కన్నవారి ఊరైన పాతపట్నం నుంచి ఇంటికి తిరిగివస్తుండగా అదృశ్యమైనట్లు 9:00 గంటలకు సంతబొమ్మాళి పీఎస్‌కు ఫిర్యాదు అందగా ఎఫ్‌ఐఆర్ నమోదైంది. 15 రోజుల్లో పోలీసులు ట్రేస్ చేసి బెంగళూర్‌లో ఉన్నట్లు గుర్తించారు.

- మగువల రక్షణలో సత్ఫలితాన్నిస్తున్న దిశ చట్టం
- లైంగిక నేరగాళ్ల హడల్
- జిల్లాలో దిశ యాప్ డౌన్‌లోడ్లు 11,13,167
- ఐదు దిశా జీట్ వాహనాలు, 48 టూవీలర్లతో నిత్యం నిఘా

శ్రీకాకుళం క్రైమ్: మహిళల భద్రతకు పెద్దపీట వేస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 2020 మార్చి 3న అమల్లోకి తీసుకొచ్చిన దిశ చట్టం మగువలకు శ్రీరామరక్షగా నిలుస్తోంది. స్త్రీల పట్ల నేరాలకు పాల్పడే వారిని కటకటల వెనక్కి పంపిస్తోంది. ఈ చట్టం ప్రారంభమైనప్పటి నుంచి జిల్లాలో పోక్సో యాక్ట్ ప్రకారం 54 కేసులు నమోదు కాగా రెండు మినహా అన్నీ విచారణ పూర్తి చేసుకుని న్యాయస్థానాల్లో ఉన్నాయి. మూడు నేరారోపణ రుజువై నలుగురు ముద్దాయిలకు శిక్ష కూడా పడింది. దిశా చట్టంపై నమ్మకం పెరిగి భర్తల వేధింపులకు తాళలేని భార్యలు ధైర్యంగా పోలీస్‌స్టేషన్ మెట్లెక్కి ఫిర్యాదు చేస్తున్నారు. ఈవ్‌టీజింగ్‌లు, ర్యాగింగ్‌ల బారిన పడే విద్యార్థినులు సైతం దిశా యాప్‌లో ఫిర్యాదు చేసి రక్షణ పొందుతున్నారు.

సకాలంలో స్పందన..

- దిశ యాప్ డౌన్‌లోడ్ చేసి పూర్తిస్థాయిలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి.
- మగువలు ప్రమాదానికి గురైనప్పుడు అందులోని ఎస్‌వోఎస్ బటన్ క్లిక్ చేస్తే నేరుగా విజయవాడ కంట్రోల్‌రూమ్‌కు వెళ్లి అక్కడి నుంచి జీపీఎస్ ద్వారా ఘటనాస్థలిని గుర్తించి సంబంధిత పీఎస్‌కు, జిల్లా కంట్రోల్‌రూమ్‌కు సమాచారం అందుతుంది.
- ఇదంతా రెండు నిమిషాల్లో జరుగుతుంది.
- ప్రమాదస్థలికి వెంటనే పోలీసులు చేరుకుంటారు.
- ఈ ప్రక్రియ మొత్తం పది నిమిషాల్లో పూర్తవుతుంది.



కళాశాలలో దిశపై అవగాహన

సంవత్సరం	భార్యాభర్తలు ఫిర్యాదులు	ఎఫ్‌ఐఆర్ నమోదైనవి
2020	531	67
2021	754	71
2022	1002	114
2023	682	72

(ఆగస్టు వరకు..)

నేరారోపణ రుజువైనవి..

- 2021 జలుమూరు మండలం (గుగ్గిలి పంచాయితీ గుండువలస గ్రామం)లో మూత్రవిసర్జన చేయడానికి వీధి చివరకు వెళ్లిన బాలికను అదే గ్రామానికి చెందిన వ్యక్తి నిర్మాణంలో ఉన్న భవనం వద్దకు బలవంతంగా తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాలిక తల్లిదండ్రులు ఫిర్యాదు చేయడంతో పోక్సో యాక్ట్ కింద కేసు నమోదైంది. దిశా డీఎస్పీ ఎస్.వాసుదేవరావు దర్యాప్తు చేపట్టి నిందితున్ని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. నేరం రుజువుకావడంతో ఈ ఏడాది ఆగస్టు 22న ముద్దాయికి 20 ఏళ్ల జైలు శిక్ష, రూ. 60 వేలు జరిమానా విధించారు.
- 2020 డిసెంబరులో జి.సిగడాం మండలం భీమవరం గ్రామానికి చెందిన బాలికపై అదే గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు లైంగిక దాడికి పాల్పడ్డారు. బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు దిశా డీఎస్పీ దర్యాప్తు చేయగా ప్రభుత్వ న్యాయవాది పి.వెంకటరమణారావు శ్రీకాకుళం ప్రత్యేక ట్రిబ్యునల్ కోర్టులో వాదనలు జరిపారు. ముద్దాయిలిద్దరికీ 20 ఏళ్లు చొప్పున జైలు, జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.
- 2021 జూలైలో కాశీబుగ్గలో ఓ బాలికపై కాశీబుగ్గకే చెందిన వ్యక్తి లైంగిక దాడి చేయడంతో కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. 2022 మే 10న ముద్దాయికి ఐదేళ్ల జైలుశిక్ష, రూ.500 జరిమానా విధిస్తూ కోర్టు తీర్పిచ్చింది.

దిశా బీట్లు..

జిల్లావ్యాప్తంగా ముఖ్య నేరప్రాంతాలు, విద్యాసంస్థల సముదాయం, బస్‌కాంప్లెక్సులు, పవిత్ర దినాల్లో దేవాలయాల పరిసర ప్రాంతాల్లో దిశా బీట్ వాహనాలు నిత్యం గస్తీ కాస్తుంటాయి. దిశా పెట్రోలింగ్ కార్లు (ఇచ్ఛాపురం, కాశీబుగ్గ, టెక్కలి, ఆమదాలవలస, శ్రీకాకుళం పీఎస్‌ల పరిధి ఒక్కోటి, డీఎస్పీకి ఒకటి) జిల్లాలో ఆరు ఉండగా టూవీలర్లు 48 (మన్యం, విజయనగరం జిల్లాలకు చెందిన సీతంపేట, హిరమండలం, రాజాం, వీరఘట్టంలతో కలిపి) ఉన్నాయి.

దిశయాప్ డౌన్‌లోడ్	టిట్‌అవర్ డేటా (ఎగ్జాక్ట్ రిజిస్ట్రేషన్)	ఎస్‌వోఎస్ కాల్స్	టెస్ట్ కాల్స్	ఎసైన్డ్ కాల్స్	ఎఫ్‌ఐఆర్ అయినవి
11,13,167	3,09,055	28,598	27,828	770	71

నేరస్తుల్లో భయాందోళన..



దిశా చట్టం పెట్టాక త్వరితగతిన విచారణ జరిగి ఎస్పీ స్వీయ పరిశీలనలో కోర్టులో ట్రయల్ వేగవంతమై, కన్విక్షన్ రేటు పెరిగి బాధిత మహిళలకు తక్షణ న్యాయం జరుగుతోంది.
పోక్సో యాక్ట్ కేసులు, లైంగిక దాడులకు శిక్షా కాలం పెరగడంతో భయాందోళనకు లోనై బాధితులనే వివాహం చేసుకుంటున్నారు. ఇలాంటివి నా పరిధిలో హైకోర్టు వరకు వెళ్లి మరీ రాజీ పడి వివాహం చేసుకుని చక్కగా బతుకుతున్నారు. భర్తతో వేధింపులకు గురైన మహిళలు ధైర్యంగా స్టేషన్‌కొచ్చి ఫిర్యాదు చేస్తున్నారు. ఇది ఓ రకంగా మంచి మార్పు. కళాశాలలు, స్కూళ్లలోనూ నిత్యం నిఘా పెట్టి ర్యాగింగ్, ఈవ్‌టీజింగ్ పాల్పడినవారిపై చర్యలు తీసుకుంటున్నాం.

– ఎస్.వాసుదేవరావు, దిశా డీఎస్పీ

కౌన్సిలింగ్ చేస్తారిలా..

- భార్యాభర్తలు తగాదా పడి స్టేషన్‌కొచ్చిన సందర్భంలో ఎనిమిది మందితో (న్యాయవాదులు, డీఆర్‌డీఏ, రిటైర్డు సీనియర్ సిటిజన్లు ఇద్దరేసి చొప్పున, ఒక రిటైర్డు ఎస్‌ఐ, ఒక ఐసీడీఎస్ అధికారి) కూడిన దిశా కౌన్సిలింగ్ బృందం వారికి పది, 15 రోజుల్లో మూడు కౌన్సిలింగ్‌లు ఇస్తారు.
- అప్పటికీ మారకపోతే నెల తర్వాత అబ్జర్వేషన్‌లో ఉంచి రిపీటెడ్ కౌన్సిలింగ్‌కు పిలుస్తారు. అయినప్పటికీ విడిపోవడానికే నిర్ణయిస్తే.. ఎఫ్‌ఐఆర్ వేస్తారు.
- దిశా ప్రారంభమైన నాటి నుంచి ఇప్పటి వరకు 2969 ఫిర్యాదుల్లో 371 ఎఫ్‌ఐఆర్‌లు వేశారు. 2598 మంది భార్యాభర్తలను కలిపారు.




శ్రీకాకుళం మహిళా డిగ్రీ కళాశాలలో దిశా యాప్‌పై అవగాహన

ఉమెన్ డిగ్నిటీ డే..

రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ ఆదేశాలతో ప్రతి శుక్రవారం అన్ని పీఎస్‌ల పరిధిలో మహిళల గౌరవ దినం నిర్వహించాలని డీజీపీ కార్యాలయం నుంచి ఈ ఏడాది జూలై 7న ఉత్తర్వులు రావడంతో దిశా ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వర్తిస్తున్నారు.

చిట్టి గుండెకు శ్రీరామరక్ష

- పిల్లల హృదయాలకు ప్రభుత్వ రక్షణ
- టీటీడీ ఆధ్వర్యంలో 15 ఏళ్ల లోపు పిల్లలకు గుండె పరీక్షలు నేడు
- రిమ్స్ ఆస్పత్రిలో 27వ నంబర్ గదిలో పరీక్ష శిబిరం ఏర్పాటు
- నిర్ధారణ పూర్తయ్యాక తిరుపతి పద్మావతి ఆస్పత్రిలో చికిత్స
- డిసెంబర్‌లో పెద్దలకు గుండె పరీక్షల శిబిరం




శ్రీకాకుళం: జిల్లాలో 15 ఏళ్ల లోపు చిన్నారులకు బుధవారం గుండె పరీక్షలు నిర్వహించనున్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో నడుస్తున్న శ్రీపద్మావతి పిల్లల గుండె ఆస్పత్రితో పాటు జిల్లా ఎర్లీ ఇంటర్‌వేషన్ సెంటర్, నేషనల్ హెల్త్ మిషన్, రాష్ట్రీయ బాల సురక్ష సంయుక్తంగా ఈ పరీక్ష శిబిరం నిర్వహిస్తున్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ఈ పరీక్షలు చేపట్టగా బుధవారం శ్రీకాకుళం జిల్లాకు సంబంధించిన చిన్నారులను రిమ్స్ వైద్య కళాశాలకు అనుబంధంగా ఉన్న ఆస్పత్రిలో 27వ నంబర్ గదిలో గుండె పరీక్షలు నిర్వహించనున్నారు. పద్మావతి చిల్డ్రన్ హార్ట్ సెంటర్‌కు చెందిన చిన్నపిల్లల గుండె వైద్య నిపుణులు డాక్టర్ ఎన్.శ్రీనాథ్ రెడ్డి, డాక్టర్ హృదయ్ చంద్ర, డాక్టర్ పద్మావతిలు ఈ పరీక్షలు నిర్వహిస్తారు. శ్రీకాకుళం జిల్లాకు చెందిన డాక్టర్ సి.పి.శ్రీదేవి కార్యక్రమానికి కోఆర్డినేటర్‌గా వ్యవహరిస్తున్నారు. 2డీ ఎకో స్కాన్ ద్వారా చిన్నారుల గుండెలో లోపాలు గుర్తిస్తారు. అనంతరం తిరుపతిలోని పద్మావతి చిల్డ్రన్ హార్ట్ కేంద్రానికి పిల్లలను తరలించి ఎస్వీ ప్రాణదాన ట్రస్టు, టీటీడీ ఆధ్వర్యంలో ఉచితంగా వైద్యాన్ని అందిస్తారు. అవసరమైన వారికి శస్త్ర చికిత్సలు నిర్వహిస్తారు.

డిసెంబర్‌లో పెద్దలకు..

రాష్ట్ర ప్రభుత్వం ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించిన విషయం విదితమే. ఇందులో భాగంగా పెద్దల్లో గుండెపోటు మరణాలు తగ్గించేందుకు ప్రత్యేక కార్యక్రమం రూపొందించారు. దీనిని పైలట్ ప్రాజెక్టుగా తిరుపతిలో నిర్వహించగా ఈ నెలలో గుంటూరు, విశాఖపట్నం, కర్నూలులో ప్రారంభించారు. ఆయా జిల్లాల్లో విజయవంతమైతే రాష్ట్ర వ్యాప్తంగా విస్తరించేందుకు నిర్ణయం తీసుకున్నారు. కరోనా తర్వాత అనేక చోట్ల గుండె సంబంధిత వ్యాధితో మృతి చెందుతున్న వారి సంఖ్య పెరగటంతో ప్రభుత్వం ఈ చర్యలు చేపట్టింది. గుండెపోటుకు గురైన వారికి గోల్డెన్ హవర్‌గా చెప్పుకునే మొదటి గంటలో చికిత్స అందేలా కార్యక్రమాన్ని రూపొందించారు. హార్ట్ ఎటాక్ వచ్చిన సమయంలో ప్రాణరక్షగా భావించే రూ.40వేలు విలువైన థ్రాంబోలైసిస్ ఇనే ఇన్‌జంక్షన్‌తో రోగి ప్రాణాన్ని కాపాడేలా చర్యలు చేపట్టారు. డిసెంబర్‌లోగా ఈ కార్యక్రమం అమలయ్యే అవకాశం ఉంది.

వినియోగించుకోవాలి..



15 ఏళ్ల లోపు పిల్లలకు గుండె సంబంధిత సమస్యలు ఉన్నా, ఆయాసం, అధిక చెమటలు పట్టడం వంటి లక్షణాలు ఉన్నా ఈ శిబిరానికి వచ్చి పరీక్షలు చేయించుకోవాలి. అత్యంత ఖరీదైన వైద్యాన్ని టీటీడీ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా అందిస్తుంది. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి..

– డాక్టర్ సి.పి.శ్రీదేవి, ప్రోగ్రాం కో–ఆర్డినేటర్

యువహో..

- ఉల్లాసంగా యువజనోత్సవాలు
- జిల్లా నలుమూలల నుంచి హాజరైన యువత
- పోటీలతోనే సృజనాత్మకత: జేసీ ఎం.నవీన్



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న జేసీ నవీన్



డ్యాన్స్ చేస్తున్న విద్యార్థినులు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాస్థాయి యువజన ఉత్సవాలు ఆద్యంతం ఉల్లాసంగా, ఉత్సాహంగా సాగాయి. యూత్ ఫెస్టివల్ వేడుకల్లో యువతీ యువకులు వివిధ నృత్యప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. తమలోని ప్రతిభను ప్రదర్శిస్తూ ఆహూతులను మంత్రముగ్ధులను చేశారు. ఇందుకు శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల సెమినార్ హాల్ వేదికగా నిలిచింది. విజేతలుగా నిలిచినవారు గుంటూరులో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రాతినిధ్యం వహించనున్నారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ మాట్లాడుతూ యువత, విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు యువజనోత్సవాలు ఎంతగానో దోహదపడతాయన్నారు. స్వామి వివేకనంద జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. సెట్‌శ్రీ సీఈవో బి.వి.ప్రసాదరావు మాట్లాడుతూ యూత్ ఫెస్టివల్ విధివిధానాలు వివరించారు. కార్యక్రమంలో స్థానిక మహిళా కళాశాల ప్రిన్సిపాల్ కె.సూర్యచంద్రరావు, మెప్మా పీడీ కిరణ్ కుమార్, వయోజన విద్య ఉపసంచాలకులు ఎం.వెంకటరమణ, జిల్లా ఉపాధి కల్పనాధికారి కొత్తలంక సుధా, ఇంటెక్ సభ్యులు రాధాప్రసాద్, యూత్ కోఆర్డినేటర్ కె.వెంకట్ ఉజ్వల్, చీఫ్ కోచ్ కె.శ్రీధర్ రావు, జిల్లా పర్యాటకాధికారి ఎస్.నారాయణరావు, సెట్‌శ్రీ అప్పలనాయుడు, సహాయ మేనేజర్ కె.వి.రమణ తదితరులు పాల్గొన్నారు.

చిట్టి చేతులు.. మట్టి గణపతులు



పలాస మండలం రామకృష్ణాపురం సత్యసాయి విద్యావిహార్‌లో మంగళవారం మట్టి వినాయక ప్రతిమల ఆవశ్యకతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. పర్యావరణానికి హాని కలిగించే రసాయనాలు, కృత్రిమ రంగులు వాడకుండా విగ్రహాలు తయారు చేయడాన్ని ప్రిన్సిపాల్ ప్రీతి చౌదరి వివరించారు. - కాశీబుగ్గ

నూతన విద్యా విధానంపై సూచనలకు ఆహ్వానం



సెమినార్ బ్రోచర్ విడుదల చేస్తున్న వీసీ నిమ్మ వెంకటరావు

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో నూతన విద్యా విధానం అమలుకు సూచనలు ఆహ్వానిస్తున్నట్లు వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ నిమ్మ వెంకటరావు తెలిపారు. విద్యా విభాగం ఆధ్వర్యంలో అక్టోబర్ 4, 5 తేదీల్లో నూతన విద్యా విధానం –2020 అమలు, సవాళ్లు, ప్రయోజనాలు అంశంపై సదస్సు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ మేరకు వర్సిటీలో మంగళవారం సెమినార్ బ్రోచర్లు ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో నైపుణ్యాల కల్పన, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లక్ష్యంగా నూతన విద్యా విధానానికి కేంద్ర విద్యా మంత్రిత్వశాఖ శ్రీకారం చుట్టినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ సీహెచ్‌ఏ రాజేంద్రప్రసాద్, ప్రిన్సిపాళ్లు ప్రొఫెసర్ బిడ్డిక అడ్డయ్య, ప్రొఫెసర్ చింతాడ రాజశేఖర్‌రావు, డాక్టర్ ఎస్.ఉదయ్‌భాస్కర్, సెమినార్ కన్వీనర్ డాక్టర్ హనుమంతు సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ధనలక్ష్మిగా విజయదుర్గ



శ్రీకాకుళం కల్చరల్: శ్రీకాకుళం నగరంలోని నానుబాలవీధిలో విజయదుర్గ అమ్మవారిని నిజ శ్రావణ మంగళవారం సందర్భంగా ధనలక్ష్మిగా అలంకరించారు. అర్చకులు ఆరవెల్లి సూర్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో సహస్ర పుష్పార్చన, పంచామృతాభిషేకాలు, కుంకుమ పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

24న స్కూల్ ర్యాంకింగ్ చెస్ పోటీలు

శ్రీకాకుళం న్యూకాలనీ: రాష్ట్రస్థాయి స్కూల్ ర్యాంకింగ్ చెస్ టోర్నమెంట్‌ను ఈ నెల 24న రణస్థలంలోని ఎన్‌ఈఆర్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ ఇంటర్నేషనల్ స్కూల్ వేదికగా నిర్వహిస్తున్నట్టు ఆంధ్రా చెస్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ససపల భీమారావు తెలిపారు. శ్రీకాకుళంలోని చెస్ శిక్షణా కేంద్రంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగే ఈ పోటీల్లో వివిధ జిల్లాల నుంచి పాఠశాలల్లో చదువుతున్న క్రీడాకారులు పాల్గొంటారని చెప్పారు. పాఠశాల విద్యార్థులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో పోటీలు నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. ఆరు నుంచి 16 ఏళ్ల విద్యార్థులు అర్హులని తెలిపారు. అండర్-6, 8, 10, 12, 14, 16 విభాగాల్లో బాలబాలికలకు వేరువేరుగా పోటీలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఉచిత వసతి, భోజన సౌకర్యాన్ని ఎన్‌ఈఆర్ స్కూల్ యాజమాన్యం కల్పిస్తున్నట్టు తెలిపారు. ఆసక్తి గల వారు ఈ నెల 20లోపు 9912559735 నంబరుకు సంప్రదించి ఎంట్రీలు నమోదు చేసుకోవాలని సూచించారు. రెండు నెలల వ్యవధిలో శ్రీకాకుళం జిల్లాలో మూడో రాష్ట్ర స్థాయి టోర్నమెంట్ నిర్వహిస్తున్నందుకు గర్వకారణంగా ఉందని చెప్పారు. పూర్తి వివరాలకు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఏపీచెస్.ఓఆర్‌గ్ వెబ్‌పోర్టల్‌ను సంప్రదించాలన్నారు.

ఏపీ లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ రాక



బబితను కలిసిన అదనపు జిల్లా జడ్జి, బార్ అసోసియేషన్ ప్రతినిధులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: శ్రీకాకుళం జిల్లాతో తనకు ప్రత్యేక అనుబంధం ఉందని, తాను జిల్లా జడ్జిగా ఉన్న సమయంలోనే బార్ అసోసియేషన్ సహకారంతో నూతన జిల్లా కోర్టు ప్రారంభోత్సవం జరిగిందని ఏపీ లీగల్ సర్వీసెస్ అథారిటీ రాష్ట్ర సెక్రటరీ బబిత అన్నారు. శ్రీకాకుళం జిల్లాలో ఓ ప్రయివేటు కార్యక్రమానికి వచ్చిన బబితను సోమవారం నాలుగో అదనపు జిల్లా జడ్జి ఎస్.మహేంద్ర ఫణికుమార్, అదనపు సీనియర్ సివిల్ జడ్జి ఎం.అనూరాధ, జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు, న్యాయశ్రీ అవార్డు గ్రహీత డాక్టర్ ఎన్ని సూర్యారావు, జిల్లా ఫ్యామిలీ కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ వాన కృష్ణచంద్, డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్ మెట్ట మల్లేశ్వరరావు, చీఫ్ లీగల్ డిఫెన్స్ కౌన్సిల్ కె.ఆఫీసునాయుడు, అసిస్టెంట్ పీపీ లోలుగు నాగభూషణరావు తదితరులు సెక్రటరీని ఫారెస్ట్ అతిథి గృహంలో మర్యాద పూర్వకంగా కలిశారు.

జిల్లాస్థాయి పోటీలకు ఆహ్వానం

ఇచ్ఛాపురం రూరల్: ఈదుపురం భేతాళ యువజన సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 23న జిల్లా స్థాయి క్విజ్ పోటీలు నిర్వ హిస్తున్నట్లు నిర్వాహకులు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అదే రోజు ఉదయం వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 6 నుంచి 10వ తరగతి విద్యార్థులు అర్హులని, వివరాలకు 9000045663 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

16న జిల్లా స్కూల్‌గేమ్స్ ఎంపికలు

శ్రీకాకుళం న్యూకాలనీ: రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ పోటీల షెడ్యూల్ సమీపిస్తుండటంతో ముందస్తుగా నాలుగు క్రీడాంశాల్లో జిల్లాస్థాయి స్కూల్‌గేమ్స్ ఎంపికలు నిర్వహించాలని అధికారులు నిర్ణయించారు. ఈ నెల 16న అండర్-14, 17 బాలబాలికల ఎంపిక పోటీలను నిర్వహిస్తున్నట్టు డీఈవో కె.వెంకటేశ్వరరావు, ఎస్‌జీఎఫ్ సెక్రటరీ బి.వి.రమణ తెలిపారు. వాలీబాల్, హ్యాండ్‌బాల్, హాకీ, రెజ్లింగ్ క్రీడాంశాల్లో శనివారం ఎంపికలు జరిపిస్తున్నట్టు చెప్పారు. రెజ్లింగ్ ఎంపికలు పెద్దపాడులో నిర్వహిస్తుండగా, మిగిలిన మూడు క్రీడాంశాల్లో ఎంపికలను శ్రీకాకుళం నగరంలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల, కోడిరామ్మూర్తి స్టేడియం ప్రాంగణాల్లో నిర్వహిస్తామని పేర్కొన్నారు. అండర్-14కు 2010 జనవరి ఒకటి తర్వాత, అండర్-17కు 2007 జనవరి ఒకటి తర్వాత జన్మించిన క్రీడాకారులు అర్హులని తెలిపారు. స్కూల్ అకడమిక్ మోనటరింగ్ యాప్‌లో వివరాలను రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, పూర్తివివరాలకు 9441569785 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

మర్యాదతో మరింత ఆదరణ

- డ్రైవర్లు, కండక్టర్లకు నిపుణులతో కౌన్సెలింగ్
- వారంలో ఒక రోజు జోనల్ స్టాఫ్ ట్రైనింగ్ కాలేజీలో నిర్వహణ
- ఫిర్యాదుల నేపథ్యంలో ఆర్టీసీ ఉన్నతాధికారుల చర్యలు



కండక్టర్లు, డ్రైవర్లకు సూచనలిస్తున్న డిప్యూటీ సీటీఎం అప్పలనాయుడు

సాక్షి, విశాఖపట్నం: ప్రయాణికుల పట్ల సిబ్బంది మర్యాదగా వ్యవహరించడంపై ఆర్టీసీ అధికారులు దృష్టి సారిస్తున్నారు. పాసింజర్ల మన్ననలు పొందడానికి ప్రాధాన్యమిస్తున్నారు. ఇందుకోసం ఆర్టీసీ కండక్టర్లు, డ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్నారు. ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే వారి పట్ల కొంతమంది డ్రైవర్లు, కండక్టర్లు దురుసుగా ప్రవర్తిస్తున్నారని, ఏకవచనంతో సంభోదిస్తున్నారని, బస్సులు సక్రమంగా ఆపడం లేదని, దురుసుగా సమాధానం చెబుతున్నారని.. ఇలా పలు ఫిర్యాదులు ఆర్టీసీ కంప్లయింట్ సెల్‌కు అందుతున్నాయి. ఈ ఫిర్యాదులను ఆర్టీసీ యాజమాన్యం సీరియస్‌గా తీసుకుంది. ఇకపై కండక్టర్లు, డ్రైవర్లు ప్రయాణికులతో మర్యాదగా మెలిగేలా చర్యలు చేపట్టింది. ఇందుకోసం కంప్లెయింట్ సెల్‌కు అందిన ఫిర్యాదుల ఆధారంగా సంబంధిత కండక్టర్లు, డ్రైవర్లకు ప్రతి మంగళవారం కౌన్సెలింగ్ ఇవ్వాలని నిర్ణయించింది. ఆర్టీసీ జోన్-1కు సంబంధించి ఉత్తరాంధ్ర జిల్లాలతో పాటు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పరిధిలో విధులు నిర్వహిస్తున్న ఈ కండక్టర్లు, డ్రైవర్లకు విజయనగరం జోనల్ స్టాఫ్ ట్రైనింగ్ కాలేజీలో కౌన్సెలింగ్ ఇస్తున్నారు. ఈ ప్రక్రియకు మంగళవారం నుంచే శ్రీకారం చుట్టారు. ఉదయం రెండు గంటలు, మధ్యాహ్నం రెండు గంటల చొప్పున ఆర్టీసీలో ఎంపిక చేసిన అధికారులతో పాటు బయట నుంచి నిపుణులు, లెక్చరర్లు, అడ్వకేట్లను కూడా రప్పించి వారితో సుహృద్భావ వాతావరణంలో కౌన్సెలింగ్ ఇప్పిస్తున్నారు. ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణికులతో మర్యాద పూర్వకంగా మెలగాలని, వారు అడిగిన ప్రశ్నలు, సందేహాలకు దురుసుగా కాకుండా సామరస్యంగా సమాధానం చెప్పాలని, చిరాకు ప్రదర్శించకుండా మాట తీరు గౌరవప్రదంగా ఉండాలని, వారిని ఏకవచనంతో సంభోదించవద్దని, ప్రయాణికుల మన్ననలు పొందాలని సూచిస్తున్నారు. ఈ కౌన్సెలింగ్ ద్వారా వీరి ప్రవర్తనలో మార్పు తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నారు. ఆర్టీసీ కండక్టర్లు, డ్రైవర్ల వ్యవహారశైలి ప్రయాణికులపై ప్రభావం చూపుతుందన్న భావనకు అధికార్లు వచ్చారు. కౌన్సెలింగ్ ద్వారా వీరు ప్రయాణికులతో స్నేహపూర్వకంగా మెలిగితే ఆర్టీసీపై ప్రయాణికుల ఆదరణ మరింత పెరుగుతుందని, ప్రైవేటు ఆపరేటర్ల వైపు మళ్లే అవకాశం ఉండదని వీరు భావిస్తున్నారు.

నిరంతరం కొనసాగిస్తాం...



ప్రయాణికులతో కండక్టర్లు, డ్రైవర్లు మర్యాదగా వ్యవహరించడం వల్ల ఆర్టీసీకి ప్రజల్లో ఆదరణ పెరుగుతుంది. దీంతో ప్రయాణికుల ఆక్యుపెన్సీ రేషియో పెరిగి ఆర్టీసీ ఆదాయం వృద్ధి చెందడానికి కూడా దోహదపడుతుంది. కంప్లయింట్ సెల్‌కు వచ్చిన ఫిర్యాదుల ఆధారంగా సంబంధిత సిబ్బందికి బ్యాచ్‌కు 10-15 మంది చొప్పున ఎంపిక చేసి నిపుణులతో కౌన్సెలింగ్ ఇప్పిస్తున్నాం. దీనిని నిరంతరం కొనసాగిస్తాం.

– సి.రవికుమార్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, జోన్-1

పోలీసులతో టీడీపీ నేతల వాగ్వాదం



పోలీసులతో వాగ్వాదానికి దిగిన నాయకులు

శ్రీకాకుళం: శ్రీకాకుళం నగరంలోని టీడీపీ కార్యాలయం నుంచి ర్యాలీ నిర్వహించేందుకు ప్రయత్నించిన టీడీపీ నాయకులను ఒకటో పట్టణ పోలీసులు అరెస్ట్ చేశారు. మంగళవారం సాయంత్రం ఐదు గంటల సమయంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్, ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాలం అశోక్, పార్టీ నాయకులు చౌదరి బాబ్జీ, గొండు శంకర్, ముద్దాడ కృష్ణమూర్తినాయుడులు నల్ల జెండాలతో ర్యాలీకి సిద్ధమయ్యారు. ఒకటో పట్టణ ఎస్‌ఐలు గణేష్, వెంకటేష్‌లు చేరుకుని 144 సెక్షన్ అమల్లో ఉండగా ర్యాలీ నిర్వహించకూడదని చెప్పినా, పోలీసులను తోసుకుంటూ రోడ్డు ఎక్కారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ పోలీసులతో వాగ్వాదానికి దిగారు. టీడీపీ నాయకులను తాడుతో నిలువరించగా అక్కడే బైఠాయించారు. దీంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. అనంతరం పోలీసులు కూన రవికుమార్, బెందాలం అశోక్, గొండు శంకర్, జల్లు రాజీవ్, చౌదరి బాబ్జీలను అరెస్ట్ చేయగా, మిగిలిన వారు పారిపోయారు. కాగా, ఈ ర్యాలీకి 30 నుంచి 40 మంది మాత్రమే హాజరయ్యారు. దీంతో దగ్గరలో ఉన్న ప్రైవేటు కళాశాల విడిచి పెట్టే సమయంలో ర్యాలీగా రావడంతో ఎక్కువ మందిలా కనిపించారు.

14 నుంచి హిందీ పక్షోత్సవాలు

శ్రీకాకుళం కల్చరల్: హిందీ మంచ్ ఆధ్వర్యంలో ఈ నెల 14 నుంచి 28 వరకు పక్షోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఉత్తరాంధ్ర హిందీ మంచ్ ప్రచార సమన్వయకర్త కోనె శ్రీధర్, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు దొంతం పార్వతీశం, గొంపివలస రామారావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మూడు జిల్లాల్లో ఐదురోజులు చొప్పున కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. శ్రీకాకుళం జిల్లాకు సంబంధించి 14న పీఎన్‌కాలనీలోని న్యూసెంట్రల్ స్కూల్, 16న కల్లేపల్లి ఎంపీపీ స్కూల్, 19న బెజ్జిపురం జెడ్పీ హైస్కూల్, 20న అక్కులపేట జెడ్పీ హైస్కూల్, 22న బలగ ఆదిత్యా విద్యా నిలయంలో కార్యక్రమాలు జరుగుతాయని వివరించారు. ఈ నెల 28న విశాఖలో ముగింపు కార్యక్రమం జరుగుతుందని తెలిపారు.

ఆర్టీసీ ఎన్‌ఎంయూకు గుర్తింపు

శ్రీకాకుళం అర్బన్: ఏపీఎస్ ఆర్టీసీలో అతిపెద్ద యూనియన్‌గా ఉన్న ఆర్టీసీ నేషనల్ మజ్దూర్ యూనియన్‌కు ప్రభుత్వం నుంచి గుర్తింపు లభించిందని యూనియన్ జిల్లా అధ్యక్షుడు వై.అప్పయ్య తెలిపారు. ఈ మేరకు మంగళవారం సెక్రటేరియట్‌లో డిప్యూటీ సెక్రటరీ నాగమణి చేతులమీదుగా యూనియన్ పెద్దలు జీవో ఉత్తర్వుల కాపీని అందుకున్నారని పేర్కొన్నారు. సీఎం నుంచి అన్ని స్థాయిలలో ఆమోద ముద్ర పొంది గుర్తింపు లభించిందని, ఇందుకుగాను ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి, యూనియన్ ప్రతినిధులకు, నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

గణేష్ మండపాలకు అనుమతి తప్పనిసరి



ఎస్పీ రాధిక

శ్రీకాకుళం క్రైమ్ : ఈ నెల 18 నుంచి జరిగే వినాయక చవితి ఉత్సవాల్లో మండపాల ఏర్పాటుకు, ఉత్సవాల నిర్వహణకు పోలీసుల అనుమతి తప్పనిసరని ఎస్పీ జి.ఆర్.రాధిక స్పష్టం చేశారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. నిర్వాహకులు సంబంధిత సబ్ డివిజనల్ పోలీసు అధికారి (డీఎస్పీ)ను సంప్రదించాలన్నారు. అంతకంటే ముందు మున్సిపాలిటీ/పంచాయతీ, అగ్నిమాపక, విద్యుత్ శాఖలు ఇచ్చిన అనుమతుల కాపీలు జతచేయాలని సూచించారు. ప్రతి మండపానికి పీఎస్ నుంచి ఒక పోలీసును కోఆర్డినేటర్‌గా నియమిస్తామన్నారు. పగటిపూట 55 డెసిబుల్స్, రాత్రి పూట 45 డెసిబుల్స్ దాటకుండా బాక్స్‌టైపు స్పీకర్లు వినియోగించాలని, సీసీటీవీ తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని సూచించారు. ఊరేగింపు సమయంలో అశ్లీల పాటలతో డ్యాన్సులు చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రశాంత వాతావరణంలో వేడుకలు జరుపుకోవాలన్నారు.

వారంలోగా ఓటర్ల ప్రక్రియ పూర్తికావాలి



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలో జరుగుతున్న సంక్షిప్త ఓటర్ల జాబితా కార్యక్రమం త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయ వీడియో సమావేశ మందిరంలో ఓటర్ల మార్పులు, చేర్పులు, తొలగింపులు తదితర వివరాలపై కలెక్టర్ సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఫారం-8లకు సంబంధించిన వివరాలు సేకరించి మూడు నెలలైనా కొందరు అధికారులు పూర్తిచేయకపోవడం సరికాదన్నారు. ఓటర్ల వివరాలు సేకరణకు ఇంకా వారం రోజులు మాత్రమే గడువు ఉన్నందున ఈలోగా ప్రక్రియ పూర్తికావాలని ఆదేశించారు. లేనిపక్షంలో చర్యలు తప్పవని ఈఆర్‌ఓ ఏఈఆర్‌ఓలను కలెక్టర్ హెచ్చరించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ తదితరులు పాల్గొన్నారు.


హత్య కేసులో ముద్దాయి అరెస్ట్

టెక్కలి రూరల్: స్థానిక భూలోకమాతవీధిలో ఆదివారం జరిగిన హత్యకేసుకు సంబంధించి నిందితుడిని మంగళవారం అదుపులోకి తీసుకున్నట్లు టెక్కలి ఎస్‌ఐ రామకృష్ణ తెలిపారు. ఆదివారం అర్ధరాత్రి సమయంలో తండ్రి బాడ ధర్మేంద్రను పెద్ద కుమారుడు ప్రేమ్ క్రికెట్ బ్యాట్‌తో బలంగా కొట్టడంతో తీవ్రంగా గాయపడి మృతిచెందిన విషయం తెలిసిందే. ఈ ఘటనకు సంబంధించి టెక్కలి సీఐ సూర్యచంద్రమౌళి దర్యాప్తు చేపట్టారు. మంగళవారం ప్రేమ్‌ను అదుపులో తీసుకుని కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలో ఎంపీడీఓలు, మునిసిపల్ కమిషనర్లు, గ్రామ, వార్డు సచివాలయ అధికారులు, మండల విద్యాశాఖాధికారులు నిర్దేశిత లక్ష్యాలను రెండు రోజుల్లో సాధించాలని, లేనిపక్షంలో చర్యలు తప్పవని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ హెచ్చరించారు. మంగళవారం ఎంపీడీఓలు, మునిసిపల్ కమిషనర్లు, ఎంఈఓలతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో చేపడుతున్న ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల్లో కొన్ని బాగానే నడుస్తున్నప్పటికీ, మరికొన్ని అమలులో వెనుకంజలో ఉన్నాయన్నారు. అటువంటి వాటిపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. పేదలందరికీ ఇళ్లు కార్యక్రమంలో ఇంకా 4 శాతం పనులు ప్రారంభం కావాల్సి ఉందన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కింద 2,407 పనులకు అనుమతులు మంజూరు చేసినా కొన్ని ప్రారంభం కాలేదని, వాటిని వెంటనే ప్రారంభించాలని ఆదేశించారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ఈ నెల 30 నుంచి ప్రారంభం కానుందని, 594 సచివాలయాలతో పాటు 13 పట్టణ ఆరోగ్య కేంద్రాలకు మ్యాపింగ్ చేసినట్లు తెలిపారు. దీనిలో భాగంగా ఇంటింటికి వలంటీరు వెళ్లి కుటుంబంలోని ఆరోగ్య సమస్యలపై వివరాలు సేకరించి టోకెన్ అందిస్తారని, తద్వారా గ్రామంలో నిర్వహించే ఆరోగ్య శిబిరంలో వైద్యులు ఉచితంగా పరీక్షించి మందులు అందజేస్తారని వివరించారు. జిల్లాలో గ్రాస్ ఎన్రోల్మెంట్ రేషియో(జీఈఆర్) 187 సచివాలయాల్లో పూర్తయిందని, ఇంకా 562 చోట్ల పూర్తిచేయాల్సి ఉందన్నారు. సమావేశంలో గృహ నిర్మాణ సంస్థ పథక సంచాలకులు ఎన్.గణపతి, ముఖ్య ప్రణాళిక అధికారి వి.ఎస్.ఎస్.ఎల్.ప్రసన్న, డీఎంహెచ్‌ఓ బి.మీనాక్షి, సమగ్ర శిక్ష అదనపు పథక సమన్వయకర్త డాక్టర్ ఆర్.జయప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

వలస మత్స్యకారుడు అదృశ్యం



అల్లుపల్లి పోలీస్ (ఫైల్)

ఎచ్చెర్ల క్యాంపస్: మండలంలోని బడివానిపేట గ్రామానికి చెందిన అల్లుపల్లి పోలీస్(42) గుజరాత్ రాష్ట్రం వీరావల్ వలస వెళ్లాడు. గత నెల 27 నుంచి ఈయన కనిపించడం లేదు. తోటి మత్స్యకారులు కుటుంబ సభ్యులను ఆరా తీశారు. ఇక్కడికి రాలేదని చెప్పడంతో వీరావల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీస్‌కు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

జోరుగా వాన



పాతపట్నంలో కురుస్తున్న భారీ వర్షం

పాతపట్నం: జిల్లాలో పలుచోట్ల మంగళవారం వర్షం కురిసింది. పాతపట్నంలో కుండపోతగా కురవడంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. మార్కెట్ రోడ్డుతో పాటు వీధులన్నీ వర్షపు నీటితో నిండిపోయాయి. సుమారు రెండు గంటల పాటు రాకపోకలకు స్తంభించాయి. కొరసవాడ, కాగువాడ, బురాగాం, రొంపివలస, రోమదల, తెంబురూ, గంగువాడ తదితర గ్రామాల్లో పంట పొలాల్లో నీరు చేరడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

స్పోర్ట్స్ ఫెడరేషన్ ఆఫ్ డెఫ్ కార్యవర్గం ఎన్నిక



జిల్లా నూతన కార్యవర్గ ప్రతినిధులతో రాష్ట్ర సంఘ నాయకులు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాలో బధిరుల క్రీడలను మరింతగా విస్తరించి వాటి ఆదరణకు చర్యలు తీసుకుంటున్నట్లు నూతన అధ్యక్షుడు ఎం.ఈశ్వరరావు తెలిపారు. మంగళవారం శ్రీకాకుళం ఎన్‌జీవో హోంలో స్పోర్ట్స్ ఫెడరేషన్ ఆఫ్ ది డెఫ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు వై.సీతారామప్రసాద్ ఆధ్వర్యంలో జిల్లా నూతన కార్యవర్గ ఎన్నికలు జరిగాయి. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వై.సీతారామప్రసాద్, సీహెచ్ తాతారావులు మాట్లాడుతూ బధిరుల క్రీడలకు శాప్ నుంచి ప్రత్యేక నిధులు కేటాయించాలని, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించినవారికి స్పోర్ట్స్ కోటాలో 2 శాతం ఉద్యోగాలు కల్పించాలని, బధిర క్రీడాకారులకు స్పోర్ట్స్ కిట్లు, టీఏ, డీఏలు అందించాలని కోరారు. అనంతరం జరిగిన కార్యవర్గ ఎన్నికలో జిల్లా అధ్యక్షునిగా ఎం.ఈశ్వరరావు, ఉపాధ్యక్షునిగా జి.విద్యాసాగర్, ప్రధాన కార్యదర్శిగా ఎం.భాస్కరరావు, సహాయ కార్యదర్శిగా ఎం.రాజేష్‌కుమార్, కోశాధికారిగా ఆర్.గిరిబాబు, కార్యవర్గ సభ్యులుగా బి.దేవి, ఎం.బాలరాజు, ఆర్.సంతోష్‌కుమార్, జి.ఉదయ్‌శంకర్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

మీ చిట్టి చేతులతోటే మట్టి గణపతి తయారు చేయండి ఇలా..

సాక్షి మీడియా గ్రూప్, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి సంయుక్త ఆధ్వర్యంలో

వినాయకుని పుట్టినరోజు ... గణేశ్ చవితి పండుగ వస్తోంది! ఈ రోజున పెద్దవాళ్లు, పెద్ద పెద్ద పందిళ్ల నిర్వాహకులూ పెద్ద పెద్ద విగ్రహాలు తయారు చేసి భారీ ఎత్తున పూజించడం మీకు తెలుసు కదా... అయితే ప్రకృతి ప్రేమికుడైన గణనాయకుడు ప్రకృతి సిద్ధమైన, సులువుగా తిరిగి ప్రకృతిలో కలిసిపోయేలా ఉండే మట్టిగణపతి విగ్రహాలను పూజించే వారికే బోలెడన్ని ఆశీస్సులు అందిస్తాడని మీకు తెలుసు కదా... మట్టి గణపతిని మీ చిట్టి చేతులతో స్వయంగా మీరే తయారు చేసి పూజలో ఉంచి, గణపతికి ఇష్టమైన పిండివంటలు ఆరగింపజేసి, మీ కోరికలన్నీ కోరండేం! సమయం ఆసన్నమైంది. 'అయ్యో! మాకు విగ్రహం తయారు చేయడం రాదే అనో, మా దగ్గర బంకమట్టి లేదు కదా... ఇప్పుడెలా' అనో దిగులు పడకండి. మట్టిగణపతి విగ్రహం తయారు చేసే విధానాన్ని మేమే మీకు నేర్పిస్తాం. ప్రతి సంవత్సరం లాగే ఇప్పుడు కూడా సాక్షి మీడియా గ్రూప్, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి వారి సహకారంతో మట్టి గణపతి విగ్రహాల తయారీలో మీకు శిక్షణనిచ్చేందుకు ఉచిత శిబిరాన్ని నిర్వహిస్తోంది.

ఈ నెల 16వ తేదీన జరిగే ఈ కార్యక్రమంలో 5 నుంచి 16 సంవత్సరాల లోపు గల బాలలందరూ పాల్గొనవచ్చును. దీనికి ఎటువంటి రుసుము చెల్లించనక్కరలేదు. బంకమట్టిని నిర్వాహకులే ఉచితంగా సమకూర్చుతారు. అయితే మీరు చేయాల్సిందల్లా ఏమిటంటే... దిగువ తెలిపిన నంబర్లకు ఫోన్‌చేసి మీ పేర్లను నమోదు చేసుకోవడమే! ఈ శిబిరంలో పర్యావరణానికి మేలు చేసే విధంగా మట్టిని గణనాయకుని ప్రతిమలుగా రూపొందించే విధానాన్ని నేర్పిస్తారు. మరి ఇంకెందుకు ఆలస్యం..? మీరు కూడా ఈ శిక్షణ కార్యక్రమంలో పాల్గొని, మీరు తయారు చేసిన వినాయక ప్రతిమలను ఇంటికి తీసుకు వెళ్లి పూజించండి. శిక్షణకు వచ్చేవారు పాత వాటర్‌బాటిల్, పాతవస్త్రం వెంటతీసుకు రావడం మాత్రం మరచిపోవద్దేం!

అవిఘ్నమస్తు, అభీష్ట సిద్ధిరస్తు.

శిబిరం చిరునామా:
న్యూ సెంట్రల్ స్కూల్,
పి.ఎన్.కాలనీ, శ్రీకాకుళం.
తేది : 16-09-2023 (శనివారం)
సమయం : ఉ. 9.30 గం.ల నుంచి
మధ్యాహ్నం 12.30 గం.ల వరకు.
రిజిస్ట్రేషన్లకు సంప్రదించవలసిన
ఫోన్ నంబరు : 95503 11265

బైకుల చోరీ కేసులో ఇద్దరికి రిమాండ్



స్వాధీనం చేసుకున్న బైకులను చూపుతున్న పోలీసులు

ఇచ్ఛాపురం : ఆరు ద్విచక్ర వాహనాల చోరీ కేసులో ఇద్దరు నిందితులను రిమాండ్‌కు తరలిస్తున్నట్లు సీఐ ఆర్. ఈశ్వర్ చంద్రప్రసాద్ తెలిపారు. ఇచ్ఛాపురం పట్టణ పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ పురపాలక సంఘం పరిధిలో సంతపేటకు చెందిన నాగరాజు అనే వ్యక్తి ద్విచక్రవాహనం పోయిందని పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు దర్యాప్తు చేస్తుండగా కంచిలి మండలం డి.జి.పురం గ్రామానికి చెందిన మెగిలి శివ, గంగాధరపురం గ్రామానికి చెందిన గుల్లపల్లి ప్రసాద్‌లు కంచిలి నుంచి ఇచ్ఛాపురం వైపు ద్విచక్రవాహనంపై వస్తుండగా అనుమానంతో అదుపులోనికి తీసుకొన్నారు. వీరిని విచారించి ఆరు ద్విచక్ర వాహనాలు స్వాధీనంచేసుకున్నారు. అందులో మూడు పల్సర్‌బైక్‌లు, రెండు రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్‌లు, ఒక యమహ ఎఫ్‌జెడ్ బైక్ ఉన్నట్లు సీఐ తెలిపారు. నిందితులను రిమాండ్‌కి తరలిస్తున్నట్లు చెప్పారు. పట్టణ ఎస్ఐ కె.గోవిందరావు పాల్గొన్నారు.

డిగ్రీ గెస్ట్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ (ఆర్ట్స్) కళాశాలలో ఖాళీగా ఉన్న పోస్టులను గెస్ట్ లెక్చరర్లతో భర్తీ చేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ సురేఖ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కమిషనర్ ఆఫ్ కాలేజియేట్ ఎడ్యుకేషన్ ఆదేశాల మేరకు డిగ్రీ, పీజీ కోర్సుల బోధనకు సంబంధించి మొత్తం 13 పోస్టులను భర్తీ చేయనున్నట్టు పేర్కొన్నారు. కామర్స్ యూజీ 5 పోస్టులు, ఒరియా యూజీ, రాజనీతి శాస్త్రం, హిస్టరీ, కంప్యూటర్ అప్లికేషన్, జువాలజీ, బోటనీ, ఫిజికల్ ఎడ్యుకేషన్, ఒరియా పీజీ బోధనకు పోస్టుల భర్తీ చేపట్టనున్నట్టు చెప్పారు. పీజీలో 55 శాతం ఉత్తీర్ణతను కలిగి పీహెచ్‌డీ/నెట్/సెట్ అర్హతలు కలిగిన వారు అర్హులని పేర్కొన్నారు. దరఖాస్తులను ఈ నెల 16లోగా కళాశాలకు చేరేలా చూడాలని, సీసీఈ నిబంధనల మేరకు ఈ నెల 20న ఎంపిక ప్రక్రియ చేపట్టనున్నట్టు తెలిపారు. పూర్తి వివరాలకు కళాశాల అకడమిక్ కోఆర్డినేటర్ జి.రాజశేఖర్ (9000506595)ని సంప్రదించాలని కోరారు.

కాశీబుగ్గ: పలాస ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జంతుశాస్త్రం గెస్ట్ లెక్చరర్ నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ టి.గోవిందమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు ఈ నెల 15న మధ్యాహ్నం 2 గంటలకు హాజరుకావాలని సూచించారు.

గిరిజన గ్రామాలాభివృద్ధికి చర్యలు



ప్రారంభమైన సీసీ రోడ్డుపై సెల్ఫీ కార్యక్రమంలో ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్, నాయకులు

సారవకోట: గిరిజన గ్రామాల అభివృద్ధి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. మంగళవారం గుమ్మపాడు పంచాయతీ ఆశోకం గిరిజన గ్రామంలో రూ.80 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డు వద్ద కార్యకర్తలతో కలిసి సెల్ఫీ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూ ఉపరితలం నుంచి సుమారు 800 మీటర్లు ఎత్తులో ఉన్న గిరిజనల సమస్యలు తెలుసుకుని నిధులు మంజూరు చేసి రోడ్డు నిర్మాణం పూర్తి చేసినట్లు వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు బాడాన కృష్ణారావు, కొండాల బాబూరావు, పీఏసీఎస్ ఛైర్మన్ గెల్లంకి వెంకటరావు, పార్టీ నాయకులు నిక్కు రాజశేఖర్, రవి, కత్తిరి మోహనదాస్, మెండ సూర్యనారాయణ, కోటేశ్వరరావు, అరియపల్లి రాము తదితరులు పాల్గొన్నారు.

స్పందన వాయిదా

శ్రీకాకుళం పాతబస్టాండ్: టెక్కలి మండల ప్రధాన కేంద్రంలో బుధవారం జరగాల్సిన జగనన్నకు చెబుదాం మండల స్థాయి స్పందన కార్యక్రమం ఈ నెల 15కు వాయిదా పడిందని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

నాలుగేళ్ల డిగ్రీ కోర్సు ప్రవేశాలకు త్వరలో నోటిఫికేషన్

ఎచ్చెర్ల క్యాంపస్: ఈ ఏడాది నుంచి ప్రారంభం కానున్న నాలుగేళ్ల డిగ్రీ+బీఎడ్ కోర్సు ప్రవేశాలకు త్వరలో ఉన్నత విద్యా మండలి నోటిఫికేషన్ విడుదల చేస్తున్నట్లు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ నిమ్మ వెంకటరావు తెలిపారు. వర్సిటీలో మంగళవారం ఆయన మాట్లాడుతూ డిగ్రీ+బీఎడ్ కోర్సుకు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ద్వారా పరీక్ష రాసి, వర్సిటీలో ప్రవేశం పొందేందుకు 3006 మంది ఆప్షన్లు ఇచ్చుకున్నారని తెలిపారు. బీఎస్సీ+బీఈడీ (మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ)కి 1988 మంది, బీఏ+బీఎడ్ (హిస్టరీ, పాలిటిక్స్, ఎకనామిక్స్)కు 1020 మంది ఆప్షన్లు ఇచ్చినట్లు వివరించారు. ఈబ్ల్యూఎస్ కోటాతో కలిపి బీఏ+బీఎడ్‌లో 55, బీఎస్సీ+బీఎడ్‌లో 55 సీట్లు ఉన్నట్లు చెప్పారు. మెరిట్, రిజర్వేషన్ రోస్టర్, ప్రత్యేక కేటగిరి (ఎన్‌ఎస్‌ఎస్, స్పోర్ట్స్, ఫిజికల్లీ చాలెంజ్డ్, ఆంగ్లోఇండియన్) ప్రత్యేక కేటగిరి రిజర్వేషన్లలో ప్రవేశాలు కల్పించనున్నట్లు తెలిపారు. ప్రభుత్వం 15 పోస్టుల నియామకానికి నోటిఫికేషన్ జారీ చేసిందన్నారు. మొదటి ఏడాది పూర్తి చేసి రిలీవ్ అయితే సర్టిఫికెట్ కోర్సు, రెండో ఏడాది రిలీవ్ అయితే డిప్లమా, మూడో ఏడాది రిలీవ్ అయితే డిగ్రీ, నాలుగో ఏడాది రిలీవ్ అయితే డిగ్రీ+బీఎడ్ డిగ్రీలు ఇవ్వనున్నట్లు వివరించారు. ఆరు సెమిస్టర్లలో డిగ్రీ సబ్జెక్టులు, విద్యా సబ్జెక్టులు ఉంటాయని, 7, 8 సెమిస్టర్లలో పూర్తిగా విద్యా సంబంధిత సబ్జెక్టు, ప్రాక్టికల్స్, క్షేత్రస్థాయి పర్యటన మార్కులు ఉంటాయని తెలిపారు.